# కొన్ని ప్రేమలు



సూర్యుని చుట్టూ వరదగూడు.

'వాన వచ్చేట్లే ఉంది' అన్నాడు నరేంద్ర.

బావిలో కప్పల బెకబెకలు.

'నిజమే' అంది మల్లిక.

గట్టిగా శ్వాసపీల్చి 'వాన వాసనొస్తోంది' అన్నాడు నరేంద్ర. ఇద్దరూ నడుస్తున్నారు మట్టి బాట మీద. పక్కన పచ్చని మైదానంలో లేగ దూడ ఒక్కటే పరుగులు తీస్తుంది. దాన్ని చూపించి- 'నిజమే వాన వస్తుంది' అంది మల్లిక.

ఎక్కడి నుంచి వచ్చాయోగానీ ఆకాశం మీద నల్లటి మబ్బులు గుంపులు గుంపులుగా వచ్చి చేరాయి. సూర్యుడు మబ్బుల చాటుకు వెళ్లిపోయాడు. పగలే చీకటి అయింది. చల్లటి గాలి వీయసాగింది.

'మబ్బులు చెదిరిపోతాయేమో' అన్నాడు.

'ఈమాత్రం గాలికి ఏమీ కాదులే' అంది.

ప్రకృతి ముందే సూచనలు ఇస్తుంది. దాన్ని పశువులు, మనుషులు గుర్తుపడతారనడానికి ఇదో సూచన. ఇద్దరూ నడుస్తున్నారు. వాగులోకి వచ్చేసరికి చినుకులు పడడం ప్రారంభమైంది. ఒంటిమీద పడ్డ చినుకులు రాళ్లలా తాకసాగాయి. పక్కన గుబురు గుబురుగా చెట్లు, వాన జోరు హెచ్చింది. ఏ చెట్టు కూడా వాన నుంచి రక్షణ కల్పించే స్థితిలోలేదు. ఇద్దరూ తడిసి ముద్దయ్యారు. అయినా నడుస్తూనే ఉన్నారు. నరేంద్ర మల్లికను చూశాడు. ఆమె తలమీద పడిన నీరు ముక్కుమీదికి, పెదవుల మీదికి జారి కిందపడుతున్నాయి. చలికి పెదవులు టపటపమని కొట్టుకుంటున్నాయి. అతను కూడా చలికి వణికిపోతున్నాడు.

కాసుల ప్రతాపరెడ్డి

గువ్వపిట్టలా ముడుచుకుపోయి నడుస్తోంది ఆమె.

'చింతచెట్టు కింద ఆగుదాం' అన్నాడు నరేంద్ర.

ఇద్దరూ పక్కనే ఉన్న చింత చెట్టు కిందికి చేరారు. ఆకాశంలో పెద్దగా ఉరుము. ఆ తర్వాత తీగలు తీగలుగా మెరుపులు. ఆ ఉరుము శబ్దానికి మల్లిక ఒళ్లు జలదరించింది.

'భయమేస్తోందా?' అని అడిగాడు.

ఆమె చిన్నగా నవ్వింది. ఆ నవ్వులో అప్పుడప్పుడే విచ్చుకున్న మందారాలు. ముద్దబంతిలా ఆమె.

'ఉరుము ఉరిమితే అర్జునా ఫల్గుణా పార్థా కిరీటి అంటూ అర్జునుని పది పేర్లను చదివే వాళ్లం గుర్తుందా? అది చదివితే అర్జుని రథం నుంచి ఊడిపడే శిల పిడుగై మనమీద పడదని నమ్మకంఉండేది" అని అన్నాడు.

'అర్జుని రథాన్ని కృష్ణుడు నడుపుతుంటాడని, ఆ రథం మేఘాల మీదుగా పరుగు పెడుతుందని, అప్పుడప్పుడు ఆ రథం శిల ఊడిపడుతుందని, అదే పిడుగని అనుకునేవాళ్లం' అంది మల్లిక.

కథ

మాటలు పెదవులుదాటి ముద్దముద్దగా వస్తున్నాయి.

ఏదో వేరే ప్రపంచంలో ఉన్నట్టుంది ఇద్దరికి కూడా.

చిన్నప్పుడు ఇద్దరికీ ఇటువంటి అనుభవాలు చాలానే ఉన్నాయి. ఇప్పుడు మాత్రం కొత్తగా ఉంది. అప్పుడు లేని అనుభూతేదో గుండెలను సన్నగా మీటుతోంది. వయసు తేడా వల్ల వచ్చిన అనుభూతా ఇది. మల్లిక నరేంద్రకు స్వయానా మరదలు. మేనత్తను, మామను, ఆ సాకుతో బావను చూద్దామని ఈ ఊరు వచ్చింది. ఆమె ఊరికి వచ్చి వారంరోజుల పైనే అవుతోంది. ఈరోజు సరదాగా బాయి వద్దకని బయలుదేరారు. బాయి దగ్గర వాళ్లు చేసింది కూడా ఏమీ లేదు. నగరంలో చదువుకునేవారికి ఏ పనీ రాదనే ఉద్దేశంతో వారిని ఏపనీ చేయనివ్వలేదు. బాయిగడ్డ మీద చింత చెట్టుకింద చాలాసేపు కూర్చున్నారు. చేనంతా తిరిగిచూశారు. దొరికిన కాయలు కొరికి తిన్నారు. తీరా ఇంటికి బయలుదేరేసరికి వాన తగులుకుంది. చింతచెట్టు గాలికి ఊగుతుంటే చెట్టు మీది నీటిచుక్కలు రాలి పడుతున్నాయి. అవి వాన చినుకలకన్నా పెద్దగా ఉన్నాయి. అవి మీద పడినప్పుడు ఒళ్లు జలదరిస్తోంది. చింతచెట్టు చుట్టూ కొంత భాగాన్ని మినహాయిస్తే అంతటా నీళ్లు. ఆ నీళ్లకేదో ఆకర్షణ ఉంది. వాటిలో దూకి కేరింతలు కొట్టాలనిపిస్తోంది. కాగితపు పడవలు చేసి నీళ్లలో వదలాలనిపిస్తోంది. ఏ మాయా జలతారో వచ్చి తమిద్దరిని వేరే లోకాలకు తీసికెళ్తే బాగుండునని అనిపిస్తోంది. చాలాసేపు ఇద్దరూ మౌనం వహించారు. ఇద్దరిలో పరిపరి విధాల ఆలోచనలు, ఊహలు, కోరికలు. చిన్నప్పటి చిలిపి చేష్టలన్నీ గుర్తొస్తుంటే ఒకరినొకరు చూసుకోవాలంటే బిడియం, సిగ్గు. ఇదే కొత్తదనం వారిని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. తమ లోలోని భావాల ఉప్పెనలు ఎగిసి పడకుండా జాగ్రత్తపడుతున్నారు. ఒకరికొకరికి విడదీయరాని సాన్నిహిత్యం అదే సమయంలో దగ్గర కాలేని దూరం. ఏమిటీ వింత?

నరేంద్ర ఆమె వైపు చూశాడు. మల్లిక చలికి పిట్టలా వణికిపోతోంది. గుండెలు ఎగిసిపడుతున్నాయి.

నిజానికి, నరేంద్ర పరిస్థితి కూడా అందుకు భిన్నంగా ఏమీలేదు. వాన వెలిసింది. సూర్యుడయితే మబ్బులు దాటి రాలేదు గానీ వెలుగువరుచుకుంది. అనూహ్యంగా ఇంత పెద్ద వర్షం కురిసి అంతే త్వరగా వెలిసి వెలుగురావడం వింతగా ఉంది. అదో అద్భుతంలా ఉంది. ఈ వెలుగుకు తమ మనసులు తేలికపడ్డట్టు అనిపించింది వారికి. అనుభూతుల భారాన్ని దింపుకొని వారిద్దరూ తేటపడ్డారు.

ఆమె తన చీరకొంగును గట్టిగా పిండి ముఖం తుడుచుకుంది. అలా రెండు మూడు తడవలు చేసిన తర్వాత ముఖం తేటపడింది. అతను ఆమెనే చూస్తుండిపోయాడు. మల్లిక అతడ్ని చూసింది. అతను తన ఒంటిమీది తడిని తుడుచుకోవడానికి ఏ ప్రయత్నమూ చేయడంలేదు.

ఆమె చీర కుచ్చిళ్లను దగ్గరకు చేర్చి పిండుకుంది. పాదాలు తడిసి అక్కడక్కడా ముడతలు పడ్డాయి. అతని ఒంటిమీది నుంచి ఇంకా నీరు కారు

తూనే ఉంది. ఆమెనే చూస్తూ నిలుచుండిపోయాడు. ఆమె అతడిని పరిశీలనగా చూసింది. ఆమె చూపును గమనించి చేతితో ముఖంమీది నీళ్లను తుడిచేసుకునే ప్రయత్నం చేశాడు.

'చలి పెడుతోందా?' అని అడిగాడు. ఆమె పెదవి విప్పకుండా అవునన్నట్లు తల ఊపింది. అలా తల ఊపిన పద్ధతి అతనికి ముద్దొచ్చింది. ఆమెను దగ్గరకు తీసుకుని ముద్దుపెట్టుకోవాలనిపించింది. తన కోరికను బలవంతంగా ఆపుకున్నాడు. ఇద్దరు అక్కడి నుంచి కదిలారు. దారిలో అన్నీనీళ్లే. అక్కడక్కడ మోకాళ్ల లోతునీళ్లు. నీళ్లు చాలా ఎక్కువగా ఉన్నచోట్ల ఆమె చీరను పైకి లేపుకుని మెల్లగా నడవసాగింది. అది అతనికి కొత్తగా వుంది. అతను నీళ్లను లెక్కచేయడం లేదు. బట్టలు తడిసి ముద్దయినాసరే అలాగే నడుస్తున్నాడు. ఇప్పుడతనికి ఏదీ పట్టేట్టులేదు. అతని మదినిండా ఆమెనే నిండిపోయి ఉంది. నల్లనిమేఘంలా అతని మనసు బరువుగా, తీయగాఉంది. బహుశా ఆమెపరిస్థితి కూడా అదేనేమో!

'పెళ్లి తర్వాత ఎప్పుడైనా యాంత్రికమైనట్లు అనిపిస్తే ఈ వర్షం మిగిల్చిన అనుభూతులను, జ్ఞాపకాలను నెమరేసుకుని మళ్లీ కొత్తగా చిగురువేసిన మొక్కలా జీవితాలను ఆనందమయం చేసుకోలేమా?' అని అందామనుకున్నాడు. మనసులోని మాట పెదవులు దాటి వచ్చేలోగానే ఆమె కదిలిపోయింది.

కలిస్తే చాలు, గలగలా మాట్లాడుకునే ఆ ఇద్దరి మధ్య ఇప్పుడు అసాధారణమైన నిశ్శబ్దం. ఇది చాలా కొత్త విషయం. ఈ మార్పు ఇంత హఠాత్తుగా వచ్చేస్తుందని వారనుకోలేదు. చాలా సందర్భాల్లో అతను ముందు నడుస్తుంటే ఆమె వెనక నడవసాగింది. ఇంతకు ముందయితే గలగలా మాట్లాడుతూ పక్కనే నడిచేది. అలా ఆమె వెనక వస్తున్నప్పుడు అతను పదేపదే ఆగుతూ ఆమె దగ్గరయ్యే వరకు ఆగిపోసాగాడు. ఇది అతనికి కొత్తగా ఉంది. ఒక తీయటి బాధ్యతేదో మీద పడినట్లుంది అతనికి. ఆమెను పూవుల్లో పెట్టి ఆ సుకుమారాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత తనమీదే ఉందనిపించింది. ఇంతకుముందు ఇలాంటి ఆలోచన ఎప్పుడూ రాలేదు. ఈ అద్భుతమైన భావన ముందు ప్రపంచంలో ఏదీ నిలవదని అనిపించింది. దేవుడి కోసమే పూసిన పువ్వులా మల్లిక తనకోసమే పుట్టిందన్న భావన అతన్ని తీయటి తలంపులోకి తీసికెళ్లింది.

ఇంటికి చేరుకునేవరకు కూడా వారిద్దరి మధ్య మాటలు లేవు. ఇద్దరు కూడా తమలో తామే మాట్లాడుకుంటూ ఉండడంతో ఒకరితో ఒకరు మాట్లాడే పరిస్థితి రాలేదు. తమతో తామే మాట్లాడుకుంటున్నామనే విషయం వారికి అర్థంకాలేదు. దానివల్ల ఈపరిస్థితి వారికి ఊపిరి సలపనీయడంలేదు.

ఇద్దరూ చెరో గదిలోకి వెళ్లి బట్టలు మార్చుకున్నారు. మల్లిక టీ తెచ్చి అతనికి ఇచ్చింది. టీ తీసుకుని మంచంమీద కూర్చున్నాడు. వెచ్చని బట్టలు, ఆ వాతావరణం నరేంద్రకు హాయిగా ఉంది. ఇంతటి హాయిని మునుపెన్నడూ అనుభవించలేదు. పొగలు కక్కుతున్న టీ గొంతులోకి జారుతుండే గుండె వెచ్చపడుతోంది. ఆమె అతనికి కాస్తదూరంలో కూర్చుని తల వంచుకుని టీ తాగుతోంది. ఇంతకుముందు తనకు చాలాచేరువగా కూర్చునేది. ఇప్పుడు దూరంగా కూర్చున్నా మునుపటికన్నా దగ్గరగా అనిపిస్తోంది. టీ తాగేసి కప్పు చేతిలో పట్టుకున్నాడు. ఆమె ఆ కప్పును తీసుకుంది. అలా తీసుకోవడంలో అతని పట్ల ఆమె కేదో బాధ్యత పెరిగిన భావన వ్యక్తమైంది.



ఒకరి పట్ల ఒకరికి అపారమైన ఇష్టముంది. ఆ ఇష్టమే ఇద్దరి మధ్య సంభాషణ ఎడతెగకుండా నడిపించేది. ఆమెను సంతోషపెట్టే మాటలు అతను మాట్లాడేవాడు. అతడ్ని సంతోషపెట్టే మాటలు ఆమె మాట్లాడేది. ఒక్క వాన కారణంగా ఇద్దరి మధ్య బాధ్యతాయుతమైన మౌనమేదో ఆవరించింది. ఇప్పుడు వాన ఆ ఇద్దరి హృదయాలను ఏకం చేసినట్లుంది. ఒకరి అవసరాలను ఒకరు గుర్తించి నడుచుకోవాలనే ఆరాటం ఈకొద్ది గంటల్లోనే ఏర్ప డింది. ఒకరికొకరు విడదీయలేనంతగా ఒక్కటైపోయినట్టు ఉంది. తమ శరీరాలపై తమకు కొత్తగా స్పృహ పెరిగినట్లు కూడా ఉంది. ఈ శరీర స్పృహ వారిలో ఒక అస్తిత్వాన్ని, ఒక ప్రత్యేకతను తెచ్చిపెట్టింది.

మల్లిక నరేంద్రతో మాట్లాడడం చాలావరకు తగ్గించింది. ఇంతకుముందయితే దేన్నీ పట్టించుకోకుండా అతనితోనే ఉండిపోయి మాటలు చెప్తూవుండేది. అతనూ అలాగే మాట్లాడేవాడు. ఇప్పుడు ఎక్కువగా ఆమె మేనత్తతోనే ఉంటోంది. ఆమెను ఒంటరిగా చూడాలంటే కూడా అతనికి కష్టమైపోతోంది. అతని మనసేమో ఆమె కోసం తపించిపోతోంది. మల్లికలో ఏదో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. మల్లిక తన అలంకరణ మీద ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు అతనికి అర్థమైపోతూనే ఉంది. ఇదంతా నాకోసమే కదా అని అనుకున్నప్పుడు అతని మనసు తృప్తితో నిండిపోసాగింది.

ఆమె తమ ఊరికి బయలుదేరడానికి ముందు అతని గదిలోకి వచ్చింది. చదువుతున్న పుస్తకాన్ని పక్కన పెట్టి ఆమెవైపు చూశాడు.

'నేను వెళ్లొస్తా' అంది మెల్లగా.

'అప్పుడే' అన్నాడతను.

ఆమె మాట్లాడలేదు.

అతను ఆమె దగ్గరగా వచ్చాడు. ఆమె కాస్త వెనక్కి జరిగింది.

'నిన్ను చూడకుండా ఉండలేనేమో...' అని అతను అన్నాడు. ఆమె కూడా అదే భావాన్ని మౌనంగానే వ్యక్తంచేసింది.

'పెళ్లే దీనికి మార్గం కదూ!' అన్నాడతను.

'పెళ్లి తర్వాత కూడా ఈ ఇష్టం, ప్రేమ నిలిచే ఉంటాయంటావా?' అంది మెల్లగా.

అతనికి ఆశ్చర్యం వేసింది. ఈ ప్రశ్న తాను ఎప్పుడూ వేసుకోలేదు. గొంతులో రాయేదో అడ్డం పడినట్లు అనిపించింది.

'ఆ ప్రేమను, ఇష్టాన్ని కాపాడుకునే ప్రయత్నం చేద్దాం' అన్నాడు.

'పెళ్లి ప్రేమను, ఇష్టాన్ని చంపేస్తుందేమోనని భయంగా వుంది' అంది మల్లిక.

'పెళ్లి తర్వాత ఎప్పుడైనా యాంత్రికమైనట్లు అనిపిస్తే ఈ వర్షం మిగిల్చిన అనుభూతులను, జ్ఞాపకాలను నెమరేసుకుని మళ్లీ కొత్తగా చిగురువేసిన మొక్కలా జీవితాలను ఆనందమయం చేసుకోలేమా?' అని అందామనుకున్నాడు. మనసులోని మాట పెదవులు దాటి వచ్చేలోగానే ఆమె కదిలిపోయింది.

** ** **

**ట్యాం**క్‌బండ్ మీద కుర్చీలో కూర్చుంది స్వప్న. ఆమెకు చాలా చిరాగ్గా వుంది. ఆమె అక్కడికి వచ్చి గంటపైనే అవుతోంది. ఇంతగా వెయిట్‌చేయడం ఆమెకు నచ్చడంలేదు. వెళ్లిపోదామా అని చాలాసార్లు అనుకుంది. కానీ వస్తాడేమోననే ఆశ ఆమెను అలా కట్టిపడేస్తోంది. తాను వెళ్లిపోతే నరేంద్ర నిరాశపడతాడేమోనని ఆమె బాధ. తాను పడుతున్న తపన నరేంద్రకు అర్థమవుతుందా అని ప్రశ్నించుకుంది.

నరేంద్ర ఎప్పుడూ ఇంతే అనుకుంది. చెప్పిన టైమ్‌కు రాడు. ఆలస్యానికి ఏవో కారణాలు చెప్తాడు. ఆ కారణాలు అసత్యంగా అనిపించవు. వచ్చిన తర్వాత కాలం ఎలా గడుస్తుందో కూడా తెలియనంతగా ఆనందింపజేస్తాడు. అతని మాటల్లో ఏదో మంత్రం ఉంది అని ఆమె చాలా సార్లు అనుకుంది.

ఇక వెయిట్ చేయడం తనవల్ల కాదనిపించింది. లేచి వెళ్దామని అనుకుంటుండగా తన వెనక బైక్ చప్పుడు వినిపించింది. నరేంద్ర వచ్చాడని తెలిసిపోయింది. బైక్ చప్పుడును బట్టే ఆమె అతని రాకను గుర్తుపడుతుంది. అయినా, ఆమె వెనుదిరిగి చూడలేదు. అతని మీద యుద్ధం చేయాలనిపిస్తోంది. తనంటే ఖాతరులేదని కయ్యానికిదిగాలని అనుకుంది.

నరేంద్ర బైక్ ఆపేసి వచ్చి 'హాయ్! స్వప్నా! ఐయామ్ సారీ!!' అన్నాడు.

ఆమె మాట్లాడలేదు.

పక్కనే కూర్చున్నాడు. ఆమె దూరం జరిగింది. "కోపమొచ్చిందా? ఏం చేయను చెప్పు. మా బాస్ క్యాబిన్‌లో కూర్చోబెట్టి ఒకటే సుత్తికొట్టాడు. చెప్పేసి వద్దామంటే వీలుకాలేదు. వాడు చెప్పేది వినకపోతే తోక కత్తిరిస్తాడు" అని చెప్పాడు.

అయినా ఆమె మాట్లాడలేదు.

"మర్చేపోయా. నీకో మంచి గిఫ్ట్ తెచ్చా" అంటూ లేచి బైక్ దగ్గరకు వెళ్లి ఓ బాక్స్ తెచ్చాడు. బాక్స్ చూడ్డానికి చాలా అందంగా ఉంది. బాక్స్ తీసి ఓపెన్ చేశాడు.

"ఇది నీ చేతిలో చాలా బాగా వుంటుంది. నువ్వు ఈ పెన్నుతోనే కథలు రాయాలని నా కోరిక. దీనితో రాస్తుంటే నా గుండెతో రాస్తున్నట్టు నాకు ఫీలింగ్. దీనికో ప్రత్యేకత ఉంది తెలుసా? దీనివల్ల వేళ్లు నొప్పి పుట్టవు. దీనికి కుషన్ ఉంటుంది. దీని కాస్టెంతో తెలుసా? ఫైవ్ హండ్రెడ్ రూపీస్. నీ కోసం నాకేం పెద్ద ఖర్చనిపించలేదు ఇది" అన్నాడు.

ఆ పెన్ను వైపు చూసింది స్వప్న. చాలా బాగుంది. నరేంద్ర సెలెక్షన్ ఎప్పుడూ బాగుంటుంది. టేస్ట్ కూడా బాగుంటుంది. చిన్నచిన్న విషయాలను కూడా బాగా పట్టించుకుంటాడు. కానీ, వస్తానన్న టైమ్‌కే రాడు. ఇదే పెద్ద తలనొప్పి.

స్వప్న కథలు రాస్తుంది. ఆ కథలే అతడ్ని ఆమెకు పరిచయం చేశాయి. ఓరోజు కథా వర్క్‌షాపులో కనిపించి, "నా పేరు నరేంద్ర. నేను మీ అభిమానిని" అని పరిచయం చేసుకున్నప్పుడు ఆమె క్యాజువల్‌గానే తీసుకుంది. కానీ రానూను అతను తన కథల గురించి వ్యాఖ్యానాలు చేయడం మొదలుపెట్టాడు. చాలా చిన్న విషయాలను చాలా లోతుగా విశ్లేషించడం ఆమెకు చాలా నచ్చింది. ఏ విమర్శకుడు కూడా పట్టుకోలేని విషయాలను అతను పట్టుకునేవాడు. పైగా అతని వ్యాఖ్యానాలు తన హృదయస్పందనలకు దగ్గరగా వుండసాగాయి. ఏదైనా కథ అచ్చుయినప్పుడు అతని కామెంట్ కోసం వెయిట్ చేయడం అలవాటయింది. అతను ఫోన్ చేసి తన అభిప్రాయం చెప్పనప్పుడు ఆమెనే అతనికి ఫోన్ చేసి మాట్లాడసాగింది. ఇలా పెరిగిన పరిచయం క్రమంగా ఇద్దరినీ దగ్గర చేసింది.

ఇప్పుడు కలిస్తే కథల గురించి మాట్లాడే వ్యవధి కూడా వారికి ఉండడంలేదు. అవి చాలా చిన్న విషయాలైపోయాయి. ఒకరి పట్ల ఒకరికి గల ఆసక్తి, ఒకరి పట్ల ఒకరికి గల అభిమానం, ఒకరి పట్ల ఒకరికిగల ప్రేమ- ఇవే, అప్పుడప్పుడు మాత్రమే వారు కథల గురించి మాట్లాడుకుంటారు.

"నీకో సర్‌ప్రయిజ్ ఇవ్వాళ" అన్నాడు నరేంద్ర.

"నీ మాటలే సర్‌ప్రయిజ్. ఇంక కొత్తగా సర్‌ప్రయిజ్ ఏమిటి?" అంది స్వప్న.

"నా లేట్ నిన్ను చాలా బాధపెట్టినట్లుంది. నువ్వు బాధపడడంలో అర్థం ఉంది. నేను నీలాగే బాధపడుతున్నాను. కానీ బాధపడుతూ కూర్చుంటే ఆనందపడే క్షణాలు తగ్గిపోతాయి" అన్నాడు.

"నిన్నో మాట అడగనా?"

"అడుగు. సందేహం ఎందుకు?"

"నిన్ను ఎప్పటికీ నావద్దే కట్టి పడేసుకోవాలని ఉంది"

"కొత్తగా కట్టిపడేసుకునేదేముంది?" అన్నాడు నవ్వుతూ.

"పెళ్లి చేసుకుంటే ఏ టైమ్‌కైనా నా దగ్గరికి వస్తావనే నమ్మకం ఉంటుంది"

"పెళ్ళికి, ప్రేమకు కుదరదు. ప్రేమ పెళ్లితోనే ముగుస్తుంది" అన్నాడు.

"అలా ఎందుకనుకుంటావ్?"

"పెళ్లి చేసుకోవడమంటే రాజీ ఒప్పందం చేసుకోవడమనే నాకు అనిపిస్తుంది. భార్యాభర్తల మధ్య ప్రేమ అనేది ఉండదు"

"భార్యాభర్తలు ఎంతమంది సంతోషంగా లేరు?" అంది.

"భార్యాభర్తల మధ్య బాధ్యత మాత్రమే ఉంటుంది. ప్రేమ అనేది నిరంతర తపనకు సంబంధించిన వ్యవహారం. పెళ్లి అనేది బాధ్యతను మోయడానికి కుదుర్చుకునే ఒప్పందం."

"పెళ్లి చేసుకోకుంటే మన మధ్య ప్రేమ ఎప్పుడూ ఉంటుందంటావా?"

"మనం దూరమైనా ఆ ప్రేమ అలాగే నిలిచి వుంటుందనేది నా నమ్మకం. ఒక తీపి జ్ఞాపకంగా ఉండిపోతుంది" అన్నాడు.

"దూరమయ్యామనే వేదన ఉండదా?"

"ఆ వేదన కూడా తీయటి అనుభూతినే ఇస్తుంది. పైగా నువ్వు పెళ్లి చేసుకుని పిల్లలను కంటూ కథలు రాయడమనేది నేను ఊహించలేను" అన్నాడు.

"ఏం?"

"పెళ్లి చేసుకుంటే నీకు కథలు రాయడం కూడా ఒక వృత్తి అవుతుందనేది నా బాధ. నీ హృదయం అందులో వ్యక్తంకాదు. ఎంతమంది రైటర్స్‌ను మనం ఇప్పుడు చూడడంలేదు. ఏ రైటర్‌ను తీసుకున్నా వాళ్ల తొలి రచనలే బాగా ఉండడానికి కారణం ఏమిటి? అందులో హృదయం ప్రతిఫలించడం, సంసారచక్రంలో ఇరుక్కుపోయిన తర్వాత వారి హృదయం మొద్దుబారుతుంది. హృదయం మొద్దుబారిన తర్వాత రాసే రచనల్లో లాజిక్, కార్యకారణ సంబంధాలు గొప్పగా ఉండవచ్చుగానీ ఆ రచనలు ఫ్రెష్‌గా వుండవు. అందుకే పాఠకుల హృదయాలకు అవి తాకవు. మెదడును కదిలిస్తాయి. హృదయానికి తాకి, మనసును కల్లోలపరిచే రచనలు గొప్ప రచనలవుతాయి" అని ఓ ఉపన్యాసమే ఇచ్చాడు నరేంద్ర.

నరేంద్ర వాదన ఆమెకు వింతగానూ, విచిత్రంగానూ అనిపించింది. అతని వాదనలో ఎంతో కొంత నిజముందని అనిపించింది.

"నేను ఈ మాటలు నిన్ను తప్పించుకోవడానికి అనడంలేదు. నాకు పెళ్లి మీద నమ్మకంలేదంతే" అన్నాడు.

"నీ సిన్సియారిటీ గురించి నాకేం అపనమ్మకం లేదు. నిన్ను చూడకుండా, నీ మాటలు వినకుండా నేను ఉండగలనా అని ఆలోచిస్తున్నా"

"నా మీద నీకు ఎల్లకాలం ఇదే కాంక్ష ఉంటుందని కూడా నేను అనుకోవడంలేదు. అలా ఉండాలని కూడా నేను కోరుకోవడంలేదు. నాది ఎస్కేపిజం అయితే కావచ్చు కానీ నాకు పెళ్లి ఇష్టంలేదు" అన్నాడు.

ఆమె లేచింది. అతనూ లేచాడు. అతను బైక్ తీశాడు. ఆమె వెనక



కూర్చుంది. ఇద్దరూ ఓ హోటల్‌కు వెళ్లి డిన్నర్ చేశారు. అంతసేపు వారిద్దరి మధ్య సంభాషణ జరుగుతూనే ఉంది. పుస్తకాల గురించి, రైటర్స్ గురించి, పరస్పర ప్రేమల గురించి మాట్లాడుకున్నారు.

ఆ తర్వాత ఆమెను ఇంటివద్ద దింపాడు.

ఆమె బైక్ దిగి వెళ్లసాగింది.

"మళ్లీ ఎప్పుడు?" అన్నాడు.

"బహుశా ఇదే ఆఖరి సమావేశం" అంది.

బైక్ నిలబెట్టి అడ్డంగా వెళ్లాడు. "ఇదేమిటి, స్వప్నా! ఇంత సడెన్ డెసిషన్?" అని అడిగాడు.

"నువ్వు చెప్పిన బాధ్యతే మనమధ్య ఎంటర్ అయినట్లుంది. దీనికి స్వస్తి చెప్తే మంచిది" అంది. ఆమె అతడ్ని సున్నితంగా పక్కకు తప్పించి వెళ్లిపోయింది.

** ** **

నల్లటి నడుం మీద తెల్లటి చెమట బిందువుల మెరుపు. దేహం నలుపే. కానీ చూపులను కట్టిపడేసే సౌందర్యం. నడుం చుట్టూ కొంగు బిగించి బట్టలుతుకున్న రమణి రైకల నుంచి సౌందర్యం తన్నుకుని బయటపడుతోంది. అతను ఆ సౌందర్యం మాయలో పడిపోయి చాలాసేపవుతోంది. అలాగే చూస్తూ వుండిపోయాడు. ఆ అందాన్ని సొంతం చేసుకోవాలనే కోరిక అతనిలో. తలెత్తి అతనివైపు చూసింది రమణి. చిలిపిగా నవ్వింది.

తను ఎదురైన ప్రతిసారీ కవ్వించడం రమణికి అలవాటో, సరదానో అతనికి అర్థంకావడంలేదు. నానాటికి ఆమె పట్ల మోజు పెరుగుతోంది అతనికి. పల్లెటూరిలో రమణి అతనికో వరం. ఆమె కవ్వింతలు, ఆమె చిలిపి మాటలు లేకపోతే జీవితం నిస్సారమే కదా అనిపించేంతగా అతని మనసును ఆక్రమించింది రమణి. తనకు ఆ నలుపంటే ఎందుకంత మోజో అతనికి ఇప్పటికీ అర్థంకాలేదు. అందరూ జయప్రదను ఇష్టపడుతుంటే అతను జయసుధను ఇష్టపడేవాడు. అలాగే సరిత మీద అతనికి ఎనలేని అభిమానం. నలుపుకు తనకు ఏదో విడదీయరాని అనుబంధం వుందనుకున్నాడు అతను.

హైదరాబాద్‌లో చదువుకుంటున్న అతను ప్రతి సెలవులకు ఇంటికి వెళ్లేవాడు. అలా వెళ్లిన ప్రతిసారీ పెద్ద కాలక్షేపం రమణే అతనికి. అతను రాగానే లేడిపిల్లలా పరుగెత్తుకొచ్చేది. కబుర్లేవో చెప్పేది. తన అందంతో అతడ్ని ఆట పట్టించేది.

ఓసారి అతను టేప్‌రికార్డర్ తీసికెళ్లాడు. అది చూసి ఎంతో మురిసిపోయింది. దొంగచాటుగా ఆమె మాటలను రికార్డుచేసి వినిపించాడు. తను మాటలు విని ఎంతో సిగ్గుపడిపోయింది. పాటలు పాడితే రికార్డు చేస్తానని బతిమాలాడు. ఎంతో బతిమాలిన తర్వాత ఒప్పుకుంది. కాముని పాటలు పాడింది. బతుకమ్మ పాటలు పాడింది. ఆమె గొంతు ఒక జలపాత శబ్దంలా వుంది. వాటిని రికార్డు చేసి వినిపించాడు. ఎంతో ఆనందించింది.

" తనకు ఆ నలుపంటే ఎందుకంత మోజో అతనికి ఇప్పటికీ అర్థంకాలేదు. అందరూ జయప్రదను ఇష్టపడుతుంటే అతను జయసుధను ఇష్టపడేవాడు. అలాగే సరిత మీద అతనికి ఎనలేని అభిమానం. నలుపుకు తనకు ఏదో విడదీయరాని అనుబంధం వుందనుకున్నాడు అతను. "

జానపద పాటలపై అతనో సందర్భంలో వ్యాసం రాసి పత్రికకు పంపాడు. ఆ వ్యాసం పత్రికలో అచ్చయింది. ఆ వ్యాసంలో రమణి పాడిన పాటలను వాడుకున్నాడు. ఆ వ్యాసానికి అతనికి ఎంతో పేరు కూడా వచ్చింది.

"ఇక్కడికొచ్చినవేంది?" అని అడిగింది. దీంతో అతను ఉలిక్కిపడి ఆలోచనల్లోంచి తేరుకున్నాడు.

"నీకోసమే" అన్నాడు ఏమంటుందో చూద్దామని.

"నమ్మమంటావు...?" అంది. "నేను నిన్ను గుర్తుపెట్టుకోవాల్సిందేగానీ నేనెక్కడ నీకు గుర్తొస్తా" అంది ఆమెనే. ఇన్నాళ్లు నీకోసం నిరీక్షించాననే భావన ఆమె మాటల్లో వ్యక్తమైంది. అందుకు అతను కాస్త ఆనందపడ్డాడు. ఇంకాస్త విచారపడ్డాడు. తన కోసం ఆమె నిరీక్షిస్తున్నందుకు సంతోషం. ఇన్నాళ్లు ఆమెను దూరం చేసుకున్నందుకు విచారం.

తాను ఆమెను ఇష్టపడుతున్నాడు. నిజమే, పెళ్లి చేసుకునేవాడా? అతనికి ఆ ఆలోచన ఎప్పుడూలేదు. ఇద్దరి మధ్య ఉన్న సామాజిక అంతరాలు ఆ ఆలోచనలకు తావివ్వలేదు. అతనికి ఆమెపై ఉన్నది కోరికో, ఇష్టమో చెప్పడం కష్టం. ప్రేమ అని అంగీకరించడానికి అతనికి ధైర్యం చాలదు.

ఆ రోజుల్లో మరింత నిగనిగలాడేది రమణి. ఇప్పటికీ ఆ బిగువు, ఆకర్షణ తగ్గలేదు. దాదాపు పదేళ్లు దాటి వుంటుంది. పదేళ్లలో చాలామంది ఆడవాళ్లు ముసలివాళ్లలా తయారవుతారు. రమణి ఎందుకింకా అలాగే వుండిపోయిందనే సందేహం అతనికి కలిగింది. అడుగుదామా అనుకున్నాడు.



అతనికి పాటలు పాడి వినిపించిన కొన్నాళ్లకే ఆమెకు పెళ్లయింది. ఏడాది కూడా అతనితో కాపురం చేసినట్లు లేదు. ఇప్పుడామెకు ఇద్దరు పిల్లలు. ఆ పిల్లలు ఎవరికి పుట్టారని ఎవరూ అడగరు. వారిని ఎవరికి కన్నదీ ఆమె చెప్పదు. ఊళ్లో వాళ్లే సందర్భం వచ్చినప్పుడు, సందర్భం రానప్పుడు తలో మాట అంటుంటా రు. అవి ఎంతవరకు నిజాలో, ఎంతవరకు కాదో అతనికి అంతుబట్టదు. ఆ విషయాలను నిర్ధారించుకోవడానికి అతను ఏరోజూ ప్రయత్నం చేయలేదు. అయినా ఆమె పట్ల అతనికి ఆకర్షణ తగ్గలేదు.

ఆ రోజుల్లో అతను కూడా ఆమెను కవ్వించేవాడు. ఆ కవ్వింతలు ఆమెపై పనిచేశాయా? తనను ఆమె ఆ రోజుల్లో ఆశించిందా? తానే ధైర్యం చేయలేకపోయాడా అనేవి అతనికి అప్పుడప్పుడు తరుచుగా ఎదురయ్యే ప్రశ్నలు.

"నేనెందుకు గుర్తొచ్చానో చెప్పనేలేదు" అంది.

"నీమీద మనసుపడి..." అన్నాడు కాస్త కొంటెగా ధైర్యంచేసి.

"నువ్వు మనసుపడేట్లు ఉన్నానా?" అంది. అది హాస్యమో, తిట్టో అతనికి అర్థంకాలేదు. "అయినా నీకు మాలాంటి వాళ్లు ఏం కనిపిస్తారు గానీ..." అంది. అతని గుండెలో మరో బాణం! చేదు నిజాన్నేదో ఆమె తన మాటల్లో వినిపిస్తున్నట్లు అనిపించింది అతనికి.

అతనిక వెనుదిరిగే ప్రయత్నంలో వున్నాడు. "కోపమొచ్చిందా? రాత్రికి రారాదూ!" అంది నవ్వుతూ.

అతనిలో ఆశ మళ్లీ మొలకెత్తింది.

రాత్రి కోసం ఎదురుచూశాడు. అటు చీకటి పడుతుండగానే ఆమె ఇంట్లోకి వెళ్లాడు. ఆమె, ఆమె పిల్లలు తప్ప ఆ ఇంట్లో ఎవరూ వుండరని తెలుసు.

అతన్ని చూసి- "వచ్చినవా?" అని అంది.

అతను మాట్లాడలేదు. ఆమె మత్తులో వున్నట్లు తెలుస్తూనే వుంది. "కల్లు తాగుతావా?" అని అడిగింది. తల అడ్డంగా ఊపాడు. "నువ్వు కల్లెందుకు తాగుతావు? సీమ సరుకు తాగుతావు!" అంది.

పెద్ద బల్లపై కూర్చున్నాడు. ఆమె దగ్గరగా వచ్చింది. పైట జారిపోయి వుంది. పట్టించుకున్నట్లు లేదు. తనకోసమే అందాలను ఆరబోస్తోంది అని అనుకున్నాడు. ఒంటిపై చేయి వేశాడు. మెల్లగా ఆమె ఒంటిపై కదిలించసాగాడు.

ఆమె సర్రున వెనక్కి జరిగింది. అతను ఆశ్చర్యపోయాడు.

'వద్దు" అంది.

అతను నిరాశ చెందాడు.

"ఇంతకాలం తర్వాత నీతో సంబంధాన్ని ఈరకంగా మార్చుకోవడం నాకిష్టంలేదు. మొదటి నుంచి నేను నిన్ను కోరుకున్నాను. నీకోసమే మొగుడ్ని కూడా వదిలిపెట్టి వచ్చేశా. నువ్వు మాటలతో మురిపించావేగానీ నన్ను దగ్గరికి తీసుకోలేకపోయావు. నువ్వు నన్ను దగ్గరికి తీసుకునివుంటే నా పరిస్థితి ఇలా అయ్యేది కాదు" అంది. మాటలు ముద్దముద్దగా వున్నాయి. ఒకమాటకు మరో మాటకు పొంతన లేనట్లుగానూ వున్నాయి.

"నువ్వు నన్ను ఒక్కసారైనా అక్కున చేర్చుకుని వుంటే నీ ఒక్కడితోనే వుండిపోయేదాన్ని" అంది.

అతను మాట్లాడలేదు.

"పెళ్లి చేసుకోమని అడుగుతానని భయపడ్డావేమో!" అని గలగలా నవ్వింది. ఆ నవ్వులో అంతులేని విషాదం వ్యక్తమైంది. నరేంద్ర అక్కడ వుండలేకపోయాడు. వెనుదిరిగాడు భారంగా. ●